ప్రకృతి వ్యవసాయం దిశగా చైతన్యం

- పెరటి, మిద్దె సాగు చేపట్టండి
- ఆరోగ్యంతో పాటు ఆర్థికంగానూ లాభం
- అడిషనల్ డీపీఎం సత్యనారాయణ



మామిడికుదురు సమావేశంలో మాట్లాడుతున్న ఏడీపీఎం సత్యనారాయణ



దిండిలో డాబా సాగును పరిశీలిస్తున్న ఎ.చంద్రమౌనిక, శివకుమార్

మామిడికుదురు: ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేసే దిశగా రైతుల్లో చైతన్యం రావాలని అడిషనల్ డీపీఎం ఎం.సత్యనారాయణ సూచించారు. మామిడికుదురు మండల మహిళా సమాఖ్య భవనంలో శుక్రవారం కన్వర్జెన్సీ సమావేశం జరిగింది. మండలంలో రెండు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, మరో నాలుగు గ్రామాల్లో దీన్ని ప్రోత్సహించే దిశగా కార్యాచరణ చేపట్టామన్నారు. ఎటువంటి క్రిమి సంహారకాలు, ఎరువులు వాడకుండా ప్రకృతి ప్రసాదించిన సహజసిద్ధంగా తయారు చేసిన ద్రావణాలతో పండించిన పంటలు సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం చేస్తాయన్నారు. రసాయనాలు, ఎరువులు వాడిన పంటలను తినడం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ఈ పరిణామాల నుంచి బయట పడేందుకే ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ క్రమంగా ప్రకృతి వ్యవసాయం సాగు చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏఓ బి.మృదుల, ఏపీఎం డి.వరాలబాబు, ఏపీఓ ఆర్.రమేష్‌బాబు, ఎస్ఎఫ్ఏ రాధిక, ఎంటీ జె.నాగవేణి, ఎల్‌టూ కె.జానకి, సీహెచ్ రాధ, కె.పద్మావతి, కె.స్వాతినాగదుర్గ, జి.లెనిన్‌రావు, సీసీ ఆనంద్, వీఓఏలు, వీఏఏ, వీహెచ్ఏ తదితరులు పాల్గొన్నారు.

పెరటి, డాబా సాగుపై శ్రద్ధ వహించండి

మలికిపురం: పెరటి, డాబా సాగుపై శ్రద్ధ వహించి ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయలు సమకూర్చుకోవాలని రైతుల సాధికార సంస్థ ఇంటర్నల్ కమ్యూనిటీ రీసర్చ్ పర్సన్ ఎ.చంద్రమౌనిక సూచించారు. ప్రకృతి వ్యవసాయంపై మక్కువతో మండలంలోని దిండి గ్రామానికి చెందిన రాపాక సత్యనారాయణ తన ఇంటి పై భాగంలో డాబాపై కూరగాయలు పండిస్తూ ఆదర్శంగా నిలిచారు. చంద్రమౌనిక పర్యవేక్షణలో సాగుతున్న ఈ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. కుండీలు, ఇంట్లో వాడి పగిలిపోయిన ప్లాస్టిక్ డబ్బాలు, ప్లాస్టిక్ సంచులు మొదలైన వాటిలో మట్టి, చెత్తను నింపి ఎరువులు లేకుండా సహజసిద్ధంగా సాగు చేస్తున్నారు. తమ ఇంటిలోకి అవసరమైన ఆకుకూరలు, కాయగూరలు, సీజనల్ పండ్లు పండిస్తున్నారు. మూడో అంతస్తు పై భాగంలో ఈ మొక్కల పెంపకం చేస్తున్నారు. నిత్యం ప్రతి రోజు వాడే కూరగాయల వ్యర్థాలు, ఎండిన పేడ, వేప ఆకుల పొడితో సొంత ఎరువులు తయారు చేసుకుని ఈ మొక్కలకు వేస్తూ తమకు కావలసిన ఆకుకూరలు, కాయగూరలు పండిస్తూ ఆదర్శంగా నిలిచారు. మలికిపురం మండల వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ నల్లి శివకుమార్ శుక్రవారం ఈ డాబా సాగును సందర్శించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి ప్రాంగణంలోనూ ఇంటి పై భాగంలో ఇలాంటి ప్రకృతి వ్యవసాయం చేసుకొని మందులు లేని స్వచ్ఛమైన కాయగూరలను తినడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉంటూ ఇతరులకు సహాయపడాలని తెలియజేశారు.

నిలిచిన ఇసుక అక్రమ తవ్వకాలు

మామిడికుదురు: అనధికారికంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలకు ఎట్టకేలకు బ్రేకు పడింది. వైనతేయ గోదావరి నదీతీరం పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, పాశర్లపూడి రీచ్‌ల నుంచి ఇంత కాలం జరిగిన ఇసుక తవ్వకాలను అధికారులు నిలిపి వేయించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆదేశాలకు ఇసుక తవ్వకాలను నిలిపివేశారని చెబుతున్నారు. పైన పేర్కొన్న నాలుగు రీచ్‌ల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఇంత కాలం ఇసుక తవ్వకాలు జరిగాయి. వీటిపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో అధికారులు స్పందించి ఇసుక తవ్వకాలను నిలుపుదల చేయించారు. ఇసుక తవ్వకాలు నిలిచి పోవడంతో బోట్లను వైనతేయ గోదావరి నదీతీరంలో కట్టేశారు.



అప్పనపల్లి రీచ్‌లో విశ్రాంతి తీసుకుంటున్న బోట్లు

ప్రస్తుతం బోట్లన్నీ విశ్రాంతి తీసుకుంటున్నాయి. ప్రస్తుతం మండలంలో ఎక్కడా ఇసుక తవ్వకాలు జరగడం లేదని తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యం ఆచార్యులు శుక్రవారం తెలిపారు.

ఘనంగా ఎన్ఏసీఎల్ భద్రతా వారోత్సవాలు

కొత్తపేట: ప్రతి కార్మికుడు వ్యక్తిగత క్రమశిక్షణ, భద్రతా చర్యలతో ప్రమాద రహిత ఫ్యాక్టరీగా ఈ నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్ (ఎన్ఏసీఎల్) నిలిచిందని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (డీసీఐఎఫ్) డి.రాధాకృష్ణ అన్నారు. నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్ (ఈతకోట పెస్టిసైడ్స్ ఇండస్ట్రీ) ప్రాంగణంలో 54 వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఫ్యాక్టరీ యాజమాన్యం, ఉద్యోగులు, కార్మికులు శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. ఆ సంస్థ ప్లాంట్ హెడ్ బి.పార్వతీకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో డీసీఐఎఫ్ రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.మురళీకృష్ణ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. డీసీఐఎఫ్ రాధాకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు మానసిక ఒత్తిడి తగ్గించుకుని, భద్రత, ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం ఇచ్చి తమ జీవితాన్ని ఆనందమయం చేసుకోవడమే ఈ జాతీయ భద్రతా వారోత్సవాల లక్ష్యమని అన్నారు. వారోత్సవాల్లో భాగంగా ఫ్యాక్టరీ ఉద్యోగులు, కార్మికులకు, గంటి, ఈతకోట, పలివెల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన భద్రతా క్విజ్, వ్యాసరచన, స్లోగన్స్, సేఫ్టీ పోస్టర్స్, ఫైర్ డ్రిల్ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఏసీఎల్ ఫ్యాక్టరీ సేఫ్టీ ఆఫీసర్ పి.కోటేశ్వరరావు, హెచ్‌పీడీ తాతారావు, జేవీఎస్ ప్రకాష్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

మురుగు కాలువలను శుభ్రం చేసుకోవాలి

అంబాజీపేట: నివాస ప్రాంతాల మధ్య ఉండే మురుగు కాలువల్లో చెత్త చెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని తద్వారా దోమల బెడద ఉండదని సీహెచ్ఓ బి.అప్పారావు అన్నారు. మాచవరం సచివాలయం 4లో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ దోమలు ఉధృతంగా ఉన్న మురుగు కాలువల్లో పాడైన ఇంజిన్ ఆయిల్ చుక్కలను వేయాలన్నారు. దాని ద్వారా దోమలను నియంత్రించవచ్చన్నారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. అలాగే గంగలకుర్రు పెదగరువులో పీహెచ్ఎస్ ఎం.భూలక్ష్మి, హెచ్‌వీఎస్.శాంతకుమారిల ఆధ్వర్యంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీకాంత్, డి.సాయికిషోర్ అన్నారు. ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి తేవద్దు



జేడీ రామలింగం

కొత్తపేట: ర్యాంకులు, మార్కుల గురించి తల్లిదండ్రులు పిల్లలపై మానసిక ఒత్తిడి తీసుకురావడం మంచిది కాదన్నారు. పిల్లల ఇష్టానికి అనుగుణంగా తల్లిదండ్రులు సహకరించాలని రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్, జిల్లా అబ్జర్వర్ మువ్వా రామలింగం సూచించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న సందర్భంగా జేడీ రామలింగం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, నియోజకవర్గ పరిధిలో పలు పరీక్ష కేంద్రాలను సందర్శించి, పరీక్షలు జరుగుతున్న తీరుతెన్నులను, విద్యార్థులకు తాగునీరు తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. ఇప్పటివరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, జరిగిన పరీక్ష పేపర్లు ఇబ్బంది లేకుండానే వచ్చాయని పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, ఎస్పీ, విద్యాశాఖ, వైద్య శాఖల ఆధ్వర్యంలో అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు.

జీవ నియంత్రణ పరిశోధనలతో రైతులకు ఉపయోగం



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ డాక్టర్ జెరార్డ్

అంబాజీపేట: కొబ్బరి, ఉద్యాన పంటలపై ఆశించే తెగుళ్లు, పురుగులను సమర్థవంతంగా నియంత్రించేందుకు నిర్వహిస్తున్న జీవనియంత్రణ ప్రయోగాలు రైతులకెంతో ఉపయోగపడుతున్నాయని అఖిల భారత వన్యతోటల సమన్వయ పథకం కోఆర్డినేటర్ డాక్టర్ బీఏ జెరార్డ్ పేర్కొన్నారు. అంబాజీపేటలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానాన్ని శుక్రవారం సందర్శించారు. జెరార్డు మాట్లాడుతూ జీవనియంత్రణ విధానంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల క్రిమిసంహారక రహిత దిగుబడులు లభిస్తాయని, మానవ ఆరోగ్యానికి ఎంతో ఉపయోగమన్నారు. అనంతరం పరిశోధన కేంద్రంలో రావేప్ (గ్రామీణ ఉద్యాన పని అనుభవం కార్యక్రమం) విద్యార్థులతో మమేకమై కొబ్బరిలో జరిగిన, జరుగుతున్న పరిశోధనా ఫలితాలు, ప్రగతి విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి దిశా నిర్దేశం చేస్తాయన్నారు. కార్యక్రమంలో పరిశోధన కేంద్ర అధిపతి డాక్టర్ ఎస్‌బీవీ చలపతిరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ కె.మమత, డాక్టర్ వి.గోవర్ధనరావు, డాక్టర్ బి.నీరజ, డాక్టర్ అనూష, ఎ.కిరీటి, విజయవాడ కొబ్బరి అభివృద్ధి బోర్డు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కుమార్వేల్, ఉద్యాన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గురువులు, తల్లిదండ్రులను పూజించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై హరికోటి శాస్త్రి

అయినవిల్లి: గురువులు, తల్లిదండ్రులను పూజించాలని.. వారి వద్ద క్రమశిక్షణ నేర్చుకోవాలని, తద్వారా దేశ ప్రగతికి తోడ్పాటు అందివ్వాలని విద్యార్థులకు స్థానిక ఎస్సై హరికోటి శాస్త్రి ఉద్బోధించారు. శుక్రవారం ఎస్సై, ముక్తేశ్వరంలోని కోనసీమ విద్యాశ్రమ్ పాఠశాలలో ఆ పాఠశాల కరస్పాండెంట్ సీహెచ్‌వీవీ ప్రసాద్ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు పెడత్రోవ పట్టకుండా ఉండేందుకు క్రమశిక్షణ అవసరమన్నారు. గురువులతో పాటు, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా విద్యార్థుల నడవడికను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఈ తరం విద్యార్థుల సెల్‌ఫోన్లకు అంకితమై అశ్లీల చిత్రాలకు ఆకర్షితులవుతున్నారన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అలాగే 18 ఏళ్లు నిండని విద్యార్థులు మోటార్ సైకిళ్లు నడిపి రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్నారన్నారు. వీరికి సరిగా చట్టాలపై అవగాహన కూడా ఉండదన్నారు. చట్టపరంగా తప్పులు చేస్తే చైల్డ్‌హోంకు తరలించాల్సి వస్తోందన్నారు. అక్కడ స్వేచ్ఛతో తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులతో కలసి జీవితం గడిపే పరిస్థితి ఉండదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ బీనాజాన్, హెడ్ కానిస్టేబుల్ శ్రీను తదితరులు ఉన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను నిలిపివేయాలి



రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరిదేవి తదితరులు

పి.గన్నవరం: తప్పులతడకగా ఉన్న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చర్యలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గ కేంద్రమైన పి.గన్నవరంలో మాలలు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. తొలుత మూడు రోడ్ల సెంటర్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి తదితరులు మాట్లాడుతూ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఐక్యంగా ఉన్న మాల, మాదిగలను విడదీసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వర్గీకరణను అడ్డుకుంటామని హెచ్చరించారు. నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, సాధనాల రమేష్, యన్నపు పెద్ద, కోట విజయభాస్కర్, వడలి కొండయ్య, కొంబత్తుల ఏసుబాబు, కొక్కిరి రవికుమార్, గిడ్డి రాంబాబు, పుచ్చకాయల సత్యనారాయణ, యన్నాబత్తుల నాగరాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆదరణ పథకం వర్తింపజేయాలి



కొత్తపేటలో ఆదరణ పథకంపై సమీక్షిస్తున్న ఎంపీడీవో

కొత్తపేట: అర్హులైన లబ్ధిదారులందరికీ ఆదరణ-3 పథకం వర్తింపజేయాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వెనుకబడిన వర్గాల్లో వివిధ కులవృత్తులకు చెందిన ఆదరణ-3 పథకము లబ్ధిదారులకు శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎంపీపీ గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండలంలోని 10 గ్రామ పంచాయతీల్లో వెనుకబడిన వర్గాల కులవృత్తుల వారికి ఆదరణ-3 పథకం కింద ప్రభుత్వం రుణ సౌకర్యం కల్పిస్తుందని ఎంపీడీఓ తెలిపారు. ఈ సదస్సుకు ఆయా లబ్ధిదారులు సుమారు 150 మంది హాజరు కాగా వారికి అవసరమైన పనిముట్ల కోసం వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఆ వివరాలను జిల్లా కలెక్టర్‌కు, పనిముట్ల సరఫరా కొరకు కార్పొరేషన్ వారికి తెలియపర్చనున్నట్టు ఎంపీడీఓ నరేష్‌కుమార్ తెలిపారు.

నగరంలో టీబీ ముక్తభారత్ అభియాన్

మామిడికుదురు: ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్‌పై నగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. జాతీయ క్షయ నిర్మూలనలో భాగంగా దీన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 24న జాతీయ క్షయ నిర్మూలనను పురస్కరించుకుని ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామని సీహెచ్ఓ కేఎస్ సత్యవతి, పీహెచ్ఎన్ బి.జయకుమారి తెలిపారు. క్షయ అంటు వ్యాధి అని చెప్పారు. దగ్గడం లేదా తుమ్మడం వల్ల తుంపర్ల ద్వారా సూక్ష్మక్రిములు గాలిలో కలిసి ఈ వ్యాధి ఆరోగ్యవంతులకు వ్యాప్తి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ బీవీవీ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ మొల్లేటి ఏడుకొండలు, ఏఎన్ఎం కె.చంద్రకుమారి, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉల్లాస్‌తో అందరికీ అక్షరాస్యత

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలవుతున్న ఉల్లాస్‌తో అందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతున్నామని జిల్లా నోడల్ ప్రత్యేక అధికారి విజయ్‌కుమార్ అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉల్లాస్ కార్యక్రమానికి ఎంపీడీఓ ఎ.రాజు అధ్యక్షత వహించగా నోడల్ ప్రత్యేక అధికారి విజయభాస్కర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత మూడు నెలల నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లోని 792 మంది నిరక్షరాస్యులకు వయోజన విద్యను బోధించామన్నారు. వారందరూ ఇప్పటి వరకూ నేర్చుకున్న అక్షరాస్యతను తెలుసుకునేందుకు ఈనెల 23న అన్ని గ్రామాల్లోను నిర్దేశించిన 28 కేంద్రాల్లో విద్యను నేర్చుకున్న అక్షరాస్యులందరికి ప్రాథమిక పరీక్షను నిర్వహించనున్నామన్నారు.

వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే

సఖినేటిపల్లి: మండలంలోని ఉయ్యూరువారి మెరక భవిత కేంద్రంలో శుక్రవారం వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే నిర్వహించారు. ఎంఈఓ-1 డి.కిషోర్ కుమార్, ఎంఈఓ-2 మద్దాలి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కేంద్ర నిర్వాహకులు ఈ డే ఏర్పాటు చేశారు. డౌన్ సిండ్రోమ్ అనేది ఒక రకమైన జన్యు సంబంధమైన వ్యాధి అని, ఈ వ్యాధి గురించి ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు ఈ నెల 21న పాటిస్తారని నిర్వాహకులు తెలిపారు. పాఠశాల హెచ్ఎం జె.శ్రీనివాసరావు, భవిత స్కూల్ టీచర్స్ జె.మిస్సమ్మ, పి.ధరణి పాల్గొన్నారు.

ఆరు కాసుల బంగారు ఆభరణాల చోరీ

పి.గన్నవరం: మండలంలోని ఊడిమూడి శివారు చింతావారిపేటలో దొంగలు ఒక ఇంటి తాళాలు పగులగొట్టి ఆరు కాసుల బంగారు ఆభరణాల చోరీ చేశారు. ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చింతావారిపేటలో నివశిస్తున్న రావి కుమారి రావులపాలెంలో పనిచేస్తోంది. ఈ క్రమంలో ఈనెల 18న ఇంటికి తాళాలు వేసి రావులపాలెం వెళ్లింది. విజయవాడలో చదువుతున్న కుమారుడు శ్రీకాంత్ ఈనెల 20న చింతావారిపేట ఇంటికి వచ్చాడు. ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటాన్ని గమనించి, తల్లికి ఫోన్ చేసి చెప్పాడు. మొత్తం ఆరు కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించి శుక్రవారం బాధితురాలు కుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

జీసీఎస్‌ను సందర్శించిన బీజేపీ నాయకులు

మలికిపురం: మండలంలోని గొల్లపాలెంలో తూర్పుపాలెం జీసీఎస్‌ను బీజేపీ నాయకులు శుక్రవారం సందర్శించారు. సైట్ ఇంచార్జ్ నాయక్‌తో సమావేశమయ్యారు. ఇటీవల విషవాయువు లీక్ అయ్యి పలువురు అస్వస్థతకు గురయిన సంఘటనపై మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన కోరారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్ మాట్లాడుతూ శంకరగుప్తం మేజర్ డ్రైన్‌ని అనుకుని ముంపునకు గురైన గ్రామాల్లో 2500 ఎకరాల కొబ్బరి తోటలు నష్టాలకు గురవుతున్నాయని ఓఎన్జీసీ ద్వారా ప్రత్యేక నిధులు ఇచ్చి ముంపునకు గురవకుండా గట్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అడబాల రాంబాబు, మాలే శ్రీనివాస నగేష్, మండల పార్టీ అధ్యక్షులు మేడిచర్ల చాణక్య, నీటి సంఘం ఉపాధ్యక్షుడు కాపిశెట్టి కనకేశ్వరరావు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం



హరికృష్ణ దంపతులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నానికి చెందిన కొండ హరికృష్ణ-రేవతి దంపతులు శుక్రవారం రూ.10,116 అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తికి అందజేశారు. దాతను వేదమంత్రాలతో దీవించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

పాఠశాలకు మాల్‌కోమ్ క్రేష్‌మేట్స్ బహూకరణ



గుడిమెళ్లంక పాఠశాలకు బహూకరించిన మాల్‌కోమ్ సామగ్రి

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంక జెడ్పీ ఉన్నత పాఠశాలకు శుక్రవారం గ్రామ ప్రముఖుడు అల్లూరి గోపరాజు సతీమణి కృష్ణ రాజే, చిన్ననాటి స్నేహితులు కలసి మాల్‌కోమ్ క్రీడకు సంబంధించిన రూ.70 వేలు విలువైన క్రేష్‌మేట్స్, రోమన్ రింగ్స్ బహూకరించారు. క్రీడా సామగ్రిని బహూకరించిన దాతలకు ఉపాధ్యాయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్.గన్నవరం గ్రామశాఖ అధ్యక్షుడిగా 'మానుకొండ'



ప్రసాద్‌ను అభినందిస్తున్న పార్టీ నాయకులు

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీ ఎల్.గన్నవరం గ్రామశాఖ అధ్యక్షుడిగా మానుకొండ ప్రసాద్ మూడోసారి ఎన్నికయ్యారు. పార్టీ రాష్ట్ర నాయకుడు యన్నాబత్తుల ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం గ్రామశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శులుగా ధర్మాడి శ్రీనివాస్, పందె వీవీ సత్యనారాయణ, పొదలాడ శ్రీనివాస్, పెదపూడి రాజారావులు తదితరులు ఎన్నికయ్యారు. సమావేశంలో పార్టీ నాయకులు చొల్లంగి చిట్టిబాబు, పెదపూడి సతీష్, కడలి సత్యనారాయణ (గణేష్), కొంబత్తుల ఏడుకొండలు, యన్నాబత్తుల మోహన్, కొల్లు రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పి.గన్నవరం: నియోజకవర్గంలోని 61 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.39,62,462లను చెక్కుల రూపంలో శుక్రవారం పి.గన్నవరంలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అందజేశారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, మద్దా చంటిబాబు, సాధనాల జేడీ, జాలెం శ్రీనివాసరాజు, దొమ్మేటి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఉపసర్పంచ్ మునిరెడ్డి

రావులపాలెం: స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ శిబిరంలో మండపేటకు చెందిన నారాయణ రెడ్డి మల్టీస్పెషలిటీ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది వైద్య సేవలు అందించారు. 190 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 86 మందికి ఈసీజీ పరీక్షలు, 54 మందికి టూడీ ఈకో టెస్టులు నిర్వహించి, 14 మందికి ఉచితంగా యాంజియోగ్రామ్ చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నలుగురు విద్యార్థుల గైర్హాజరు

పి.గన్నవరం: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మొత్తం 13 ప్రభుత్వ, నాలుగు ప్రైవేటు ఉన్నత పాఠశాలల నుంచి 795 మంది విద్యార్థులకు గాను 791 మంది శుక్రవారం నాటి ఇంగ్లీష్ పరీక్షకు హాజరు కాగా, నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ కోన హెలీనా తెలిపారు.

జగన్‌ను కలసిన నాయకుడు



జగన్‌ను కలసిన వెంకన్న

అంబాజీపేట: తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి వెంకన్న మర్యాద పూర్వకంగా కలిశారు. జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించారు. పార్టీ బలోపేతంపై చర్చించినట్లు వెంకన్న తెలిపారు.

గొందిలో తాటాకిల్లు దగ్ధం

సఖినేటిపల్లి: మండలంలోని గొందిలో గురువారం రాత్రి అల్లూరి సత్యనారాయణరాజుకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం సంభవించినట్టు తెలిసింది. ఆస్తి నష్టం రూ.7 లక్షలు ఉంటుదని స్థానిక వీఆర్వో కె.రామకృష్ణ అంచనాలు వేసి, తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావుకు శుక్రవారం నివేదిక ఇచ్చారు. స్థానికులు ఇచ్చిన సమాచారం ఆధారంగా రాజోలు ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. కాగా సదరు ఇంట్లో కాకినాడకు చెందిన మెకానిక్ పంతం నూకరాజు గత కొద్దికాలంగా అద్దెకు ఉంటున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మొత్తం అన్నీ కాలిబూడిదయ్యాయి. ప్రమాదంలో ఫర్నిచర్, నాలుగు బైక్‌లు, నగదు, బంగారం కొంత కాలిపోయినట్టు బాధితుడు చెప్పాడు. సర్పంచ్ దొండపాటి రవి కుమార్ బాధితుడిని పరామర్శించారు.

మొబైల్ పోయిన వెంటనే ఫిర్యాదు చేయాలి

అంబాజీపేట: మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే పి.గన్నవరం సర్కిల్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్లో తక్షణమే ఫిర్యాదు చేయాలని పి.గన్నవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.భీమరాజు సూచించారు. సర్కిల్ పరిధిలో గత మూడు రోజుల క్రితం మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న ఐదుగురు బాధితులకు అంబాజీపేటలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో రికవరీ చేసుకున్న మొబైల్ ఫోన్లను శుక్రవారం అప్పగించారు. మొబైల్ ఫోన్‌లు చోరీకి గురైతే వాటి వివరాలతో స్థానిక పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.చిరంజీవి ఉన్నారు.

ప్రపంచ అటవీ దినోత్సవం

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవం ఏపీ ఎన్‌జీసీ స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ జి.ప్రభావతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వేప, మామిడి, జామ, నేరేడు, గానుగ మొక్కలను నాటి మొక్కల ఆవశ్యకత గురించి ఆమె విద్యార్థులకు వివరించారు. ప్రతి సంవత్సరం వినూత్నమైన ఇతివృత్తంతో నిర్వహిస్తున్న ప్రపంచ అటవీ దినోత్సవం ఈ ఏడాది ఇతివృత్తం అడవులు, ఆహారం కాన్సెప్ట్ అని ఆమె వెల్లడించారు. పాఠశాల హెచ్ఎం జి.మల్లికార్జున రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీడీఎం చర్చికి భూ విరాళం



సంఘ పెద్దలకు భూమి దస్తావేజు అందజేస్తున్న భూదాత రాజేశ్వరి

కొత్తపేట: మండలంలోని వాడపాలెం పెదపేటలోని గోదావరి డెల్టా మిషన్ (జీడీఎం) చర్చికి అదే గ్రామానికి చెందిన వృద్ధురాలు నేతల రాజేశ్వరి నాలుగు సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. 1890లో ఈ జీడీఎం చర్చిని స్థాపించగా ఆ చర్చికి గతంలో నేతల జాన్విక్ సంఘ కాపరిగా పనిచేశారు. ఆయన భార్య రాజేశ్వరి. వారికి సంబంధించిన నాలుగు సెంట్లు స్థలాన్ని రాజేశ్వరి స్వచ్ఛందంగా చర్చికి దానంగా రాసి ఇచ్చినట్లు సంఘ కాపరి బూల జోసెఫ్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. భూదాత రాజేశ్వరికి గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు, స్త్రీల సమాజం, సండే స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో సాయినాథ్

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారిని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నూతన ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమితులైన ఐ.సాయినాథ్ జయచంద్ర శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం సాయినాథ్ జయచంద్రను అర్చకులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.